సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 10 । మే । 2025



చీనీ టన్ను రూ.23,200

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,200. కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



బ్రహ్మోత్సవాలు ప్రారంభం

పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆమిద్యాల నుంచి పల్లకీలో శ్రీవారి ఉత్సవ మూర్తులను పెన్నహోబిలానికి తీసుకొచ్చారు.

గరిష్టం/కనిష్టం
39.1°/20.7°

జిల్లాలో శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

మురళీనాయక్ పోరాటం చిరస్మరణీయం

- కలెక్టరేట్‌లో ఘన నివాళులర్పించిన జిల్లా యంత్రాంగం



మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ చేతన్, అధికారులు

ప్రశాంతి నిలయం: భారత్‌– పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ ప్రదర్శించిన ధైర్య సాహసాలు దేశ యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ టీఎస్ చేతన్ కీర్తించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీరజవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ... పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో పాల్గొన్న మురళీనాయక్ శత్రువులను తుదముట్టించి వీరమరణం పొందారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్ పేరు చరిత్ర పుటల్లో చిరస్మరణీయంగా నిలిచి పోతుందన్నారు. దేశ రక్షణలో ఆయన చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమకు యావత్ దేశం గర్విస్తోందన్నారు. అనంతరం మురళీనాయక్ ఆత్మకు శాంతి కోసం కొద్దిసేపు మౌనం పాటించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయ సారథి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వీరుడికి మరణం లేదు: ఎస్పీ



జోహార్ మురళీనాయక్ అంటూ నినదిస్తున్న ఎస్పీ రత్న, పోలీసులు

పుట్టపర్తి టౌన్/గోరంట్ల: వీరుడికి మరణం లేదని, దేశ రక్షణలో అసువులు బాసిన మురళీనాయక్ కూడా అమరుడని ఎస్పీ రత్న కీర్తించారు. దేశ కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్ యావత్ దేశానికి గర్వకారణమన్నారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని కల్లితండాకు చేరుకొని మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరాంనాయక్, జోతిబాయిలను పరామర్శించారు. సిబ్బందితో కలిసి మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియల ఏర్పాట్లపై స్థానిక అధికారులతో చర్చించారు.

వీరుడా వందనం



- దేశ సేవలో అమరుడైన మురళీ నాయక్
- కన్నీటిసంద్రమైన స్వగ్రామం కల్లితండా
- అతని జ్ఞాపకాలు తలచుకుని రోదిస్తున్న స్నేహితులు
- ఘన నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

పాకిస్తాన్‌తో జరుగుతున్న పోరులో అమరుడైన ఆర్మీ జవాన్ మురళీనాయక్‌ను తలచుకుని ఉమ్మడి అనంతపురం జిల్లా బోరున విలపిస్తోంది. అతని స్వగ్రామం కల్లితండా కన్నీటి సంద్రంలో మునిగిపోయింది. జమ్మూకశ్మీర్‌లో శత్రుమూకలను తుదముట్టిస్తూ మురళీనాయక్ వీరమరణం పొందిన వార్త శుక్రవారం ఉదయం 9 గంటలకు తెలియగానే ఉమ్మడి జిల్లాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులతోపాటు కుటుంబీకులు, సన్నిహితులు, స్నేహితులు మురళీనాయక్‌తో తమకున్న జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అధికార యంత్రాంగంతోపాటు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు కల్లితండాకు వెళ్లి మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. తల్లిదండ్రులను ఓదార్చి ధైర్యం చెప్పారు.



కల్లితండా.. కన్నీటి సంద్రం

- అమరుడైన బిడ్డను తలచుకుని కన్నీరుమున్నీరైన తండావాసులు

గోరంట్ల: పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో శత్రుమూకలను తరిమికొడుతూ వీరోచిత పోరాటం చేసిన మురళీనాయక్ అమరుడయ్యారన్న విషయం తెలియగానే అతని స్వగ్రామం గోరంట్ల మండలంలోని కల్లితండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. 150 ఇళ్లు మాత్రమే ఉన్న తండాలో అందరూ గిరిజనులే. శుక్రవారం ఉదయం మురళీ నాయక్ వీరమరణం గురించి తెలియగానే తండావాసులంతా మురళీనాయక్ స్వగృహానికి చేరుకున్నారు. తల్లిదండ్రులు జ్యోతి బాయి, శ్రీరాంనాయక్‌లను ఓదార్చారు. మురళీనాయక్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని పొగిలిపొగిలి ఏడ్చారు. గ్రామంలో చిన్నాపెద్ద తేడా లేకుండా అందరితో కలిసిమెలిసి ఉండేవాడని, అలాంటి బిడ్డ దేశం కోసం శత్రువుల చేతిలో అసువులుబాయడంతో వారంతా శోకసంద్రంలో మునిగిపోయారు. చిన్నప్పటి నుంచే దేశభక్తి మెండుగా ఉన్న మురళీ నాయక్...చాలా పట్టుదల గలవాడన్నారు. తాను అనుకున్నట్లే ఆర్మీలో చేరి దేశ సేవలో అమరుడయ్యారని విలపించారు. దేశం కోసం ప్రాణాలిచ్చిన గిరిజన ముద్దుబిడ్డ మురళీనాయక్ విగ్రహాన్ని మండల కేంద్రమైన గోరంట్లలో ఏర్పాటు చేయాలని అఖిల భారత బంజారా సంఘం నాయకులు, కుటుంబ సభ్యులు కోరారు.

నమ్మలేకపోతున్నాం



మురళీనాయక్ దేశం కోసం ప్రాణత్యాగం చేయడం గర్వంగా ఉంది. కానీ పాతికేళ్లు కూడా లేని బిడ్డకు అప్పుడే నిండు నూరేళ్లు నిండాయంటే నమ్మలేకపోతున్నాం. ఏకైక సంతానాన్ని పోగొట్టుకున్న అతని తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. అతని వీరోచిత పోరాటం వృథా కాదని భావిస్తున్నాం.

– గోవింద నాయక్, కల్లితండా

దేశభక్తి ఎక్కువ



మురళీ నాయక్ చాలామంచి అబ్బాయి. చిన్నప్పటి నుంచి దేశ భక్తి ఎక్కువ. ఎప్పుడూ సైన్యంలో పనిచేయాలని చెప్పేవాడు. అందుకే ఎన్ని అవకాశాలు వచ్చినా సైన్యంలోనే చేరాడు. నిరుపేద కుటుంబంలో పుట్టి దేశం కోసం ప్రాణాలు అర్పించి చరిత్రలో మిగిలిపోయాడు.

– చాంప్లానాయక్, కల్లితండా

సలాం సైనిక

సైన్యంలో చేరాలన్న కలను నెరవేర్చుకున్నావ్
పాతికేళ్లకే జీవితాన్ని దేశానికి అంకితమిచ్చావ్
అక్కచెల్లెమ్మల నుదుటి సిందూరం చెరిపిన..
ఉగ్రమూకలకు బదులు చెప్పావ్
దేశానికి కవచంలా నిలబడి వీరోచిత పోరాటం చేశావ్
శత్రుసేనలను చెండాడుతూ సరిహద్దులో సగర్వంగా నిలిచావ్
మాతృభూమి కోసం చివరి నెత్తురుబొట్టునూ చిందించావ్
సలాం సైనిక..
నీ త్యాగం మరువం.. నీ పోరాటం వృథా కానివ్వం
నీ రక్తాన్నే సిరాగా రాసిన చరితను వెయ్యేళ్లు చదువుకుంటాం
మువ్వన్నెల పతాకమై ఎగిరిన నీ ధైర్యం సాక్షిగా చెబుతున్నాం
ఆ పా(పి)కిస్తాన్ గాళ్లకు మరణశాసనం రాస్తాం
యుద్ధమంటే పోరాటం కాదని..మాతృభూమిపై
ప్రేమని చాటిచెబుతాం
జీవన రవళిలా 'మురళి' గానం చేస్తూనే ఉంటాం
సలాం సైనిక... సలాం

సైన్యంలో ఒక్కరోజున్నా చాలు

నాకు ఏ ఉద్యోగం వద్దు... ఎంత కష్టమైనా ఆర్మీలోకే పోతా. బోర్డర్‌లో పని చేయడం నా కల. ఒక్కరోజు పనిచేసినా చాలు. దేశం కోసం చావనైనా చస్తా. నా శవంపై భారత జెండా కప్పాలి.

– స్నేహితులు, సన్నిహితులతో మురళీనాయక్ చెప్పిన మాటలివీ..



తల్లిదండ్రులతో మురళీనాయక్ (ఫైల్)

13న కల్లితండాకు వైఎస్ జగన్


- వీర జవాన్ కుటుంబాన్ని పరామర్శించనున్న మాజీ సీఎం



జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఉషశ్రీచరణ్

రొద్దం: దేశ రక్షణలో అసువులు బాసిన జవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 13న కల్లితండాకు వస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆమె మండల పరిధిలోని కంబాలపల్లిలో పర్యటించారు. అంతకుముందు కల్లితండాలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన కల్లితండా వాసి మురళీ నాయక్ కుటుంబీకులను ఇప్పటికే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారన్నారు. వీర జవాన్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఆయన కుటుంబానికి అండగా నిలిచేందుకు స్వయంగా వస్తున్నట్లు వెల్లడించారు.

వీరమరణం పొందిన మురళీ నాయక్



అనంతపురం కార్పొరేషన్: 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళీనాయక్ వీరమరణం పొందారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. మాతృభూమి కోసం మురళీనాయక్ ప్రాణత్యాగం చేశారన్నారు. చిన్న వయసులోనే మృతి చెందడం చాలా బాధగా ఉందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. ప్రధానంగా మురళీనాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సోమందేపల్లిలో విద్యాభ్యాసం

సోమందేపల్లి: వీర మరణం పొందిన మురళీ నాయక్ పదో తరగతి వరకు సోమందేపల్లిలోని విజ్ఞాన్ పాఠశాలలో చదువుకున్నారు. తల్లిదండ్రులు జ్యోతి బాయి, శ్రీరాంనాయక్ జీవనోపాధి కోసం ముంబయికి వెళ్లగా.. మురళీ నాయక్ సోమందేపల్లి మండలం నాగినాయిన చెరువు తండాలో అమ్మమ్మ శాంతి బాయి వద్ద ఉంటూ సోమందేపల్లిలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో చదివారు. 2016–17 టెన్త్ బ్యాచ్‌కు చెందిన మురళీ నాయక్ చదువులో ఎప్పుడూ ముందుండేవాడు. మురళీ నాయక్ మృతి విషయం తెలుసుకున్న పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జునతో పాటు అతని మిత్రులు కన్నీటి పర్యంతమయ్యారు. తమతో గడిపిన జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. చదువుతోపాటు క్రీడల్లోనూ మురళీనాయక్ రాణించేవాడన్నారు. తమ తండా యువకుడు దేశం కోసం ప్రాణాలర్పించడం గర్వంగా ఉందని నాగినాయనిచెరువు తండా సర్పంచ్ అంజి నాయక్, గ్రామస్తులు చెబుతున్నారు.



మురళీనాయక్ చిత్రపటం వద్ద రోదిస్తున్న కుటుంబీకురాలు

దేశభక్తి ఎక్కువగా ఉండేది



మురళి నాయక్ నాకు మంచి మిత్రుడు. చాలా దేశభక్తి ఉండేది. పోలీసు లేదా ఆర్మీలో చేరి దేశానికి సేవ చేయాలని తపన ఉండేది. వీర మరణం పొందడం గర్వకారణంగా ఉంది. మంచి మిత్రుడిని కోల్పోవడం చాలా బాధ కల్గిస్తోంది.

– చిరంజీవి, సోమందేపల్లి

క్రమశిక్షణతో చదివేవాడు



మురళీ నాయక్ పదో తరగతి వరకూ మా పాఠశాలలో చదివాడు. చాలా క్రమశిక్షణతో చదువుకునేవాడు. ఎటువంటి వివాదాలు లేని విద్యార్థి, దేశ భక్తి కూడా ఎక్కువగా ఉండేది. మా పాఠశాలలో చదివి దేశం కోసం ప్రాణాలు అర్పించడం గర్వంగా ఉంది.

– మల్లికార్జున, కరస్పాండెంట్ , విజ్ఞాన్ స్కూల్, సోమందేపల్లి

ముగిసిన గ్రూప్‌-1 మెయిన్స్

- రెండు కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- 594 మంది అభ్యర్థులకు 381 మంది హాజరు



గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్ష తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఈ నెల 3న ప్రారంభమైన గ్రూప్‌–1 మెయిన్స్ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ఏడు రోజుల పాటు జరిగిన పరీక్షల్లో అభ్యర్థుల హాజరు 64.28 శాతం నమోదయ్యింది. అనంతపురంలోని పీవీకేకే ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, శ్రీ బాలాజీ పీజీ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. పీవీకేకే కళాశాలలో 234 మంది, శ్రీ బాలాజీ కళాశాలలో 360 మంది..మొత్తం 594 మంది అభ్యర్థులకు గాను 381 మంది హాజరయ్యారు. పరీక్షల తీరును కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ పరిశీలించారు. పరీక్షలకు లైజన్ అధికారులుగా డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జునుడు వ్యవహరించారు.

'పరివాహన్'లోనే ట్రాలీల రిజిస్ట్రేషన్

అనంతపురం సెంట్రల్: ట్రాక్టర్ ట్రాలీల రిజిస్ట్రేషన్లు ఇక నుంచి 'పరివాహన్' వైబ్‌సైట్‌లోనే జరుగుతాయని ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) ఎం.వీర్రాజు తెలిపారు. ఇప్పటి వరకూ ఈ–ప్రగతి సైట్‌లో రిజిస్ట్రేషన్‌లు జరిగేవని, కొద్దిరోజులుగా ఇందులో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో రవాణాశాఖలో ప్రతి సేవా ఆన్‌లైన్‌లోకి వెళ్లిపోయిందన్నారు. ఈ విషయాన్ని ట్రాలీల తయారీ డీలర్లు గమనించి ట్రేడ్ లైసెన్స్ కోసం ఆర్టీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జిల్లా ప్రజల ఆశలపై నీళ్లు



సీఎం చంద్రబాబు ప్రసంగం మధ్యలోనే జనం వెళ్లిపోగా ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు



సీఎం గో బ్యాక్ అంటూ నినదిస్తున్న ఏబీవీపీ నాయకులు

- సూపర్ సిక్స్ అమలుపై స్పష్టత ఇవ్వని సీఎం చంద్రబాబు

ఉరవకొండ/ వజ్రకరూరు: ఎన్నో ఆశలు పెట్టుకొని ఎదురుచూసిన జిల్లా ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నిరాశపరిచింది. శుక్రవారం వజ్రకరూరు మండలం ఛాయాపురం వద్ద హంద్రీ–నీవా కాలువ వెడల్పు పనుల పరిశీలనతో పాటు ప్రజావేదిక కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. సంపదను సృష్టించి జిల్లాను అభివృద్ధి చేస్తానని, ఇంట్లో ఎక్కువమంది పిల్లలను కని జనాభా పెంచేలా చూడాలని చెప్పడం తప్ప హామీల అమలుపై సీఎం తన ప్రసంగంలో ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. తల్లికి వందనం పథకం త్వరలోనే అమలు చేస్తామని, అన్నదాత సుఖీభవ పథకం కేంద్రం వాటా ఇచ్చిన రోజే రాష్ట్రం తరఫున నిధులు విడుదల చేస్తామని చెప్పుకొచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఎప్పుడు అమలు చేస్తారని కొందరు మహిళలు అడిగితే.. సీఎం సమాధానం ఇవ్వలేదు. మరికొన్ని ముఖ్యమైన సూపర్ సిక్స్, తదితర పథకాల గురించి మాట్లాడకపోవడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తూ సభ నుంచి బయటకు వెళ్లిపోవడం కనిపించింది. షెడ్యూల్ ప్రకారం ముఖ్యమంత్రి ఉదయం 12 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకోవాల్సి ఉండగా.. గంట ఆలస్యంగా చేరుకున్నారు. ప్రజావేదికలోకి పోలీసులు ఉదయం 9 గంటలకే ప్రజలను అనుమతించడంతో ఎండ తీవ్రతకు కూర్చోలేక అవస్థలు పడ్డారు. సభకు వచ్చిన వారికి సరిపడు తాగునీరు అందుబాటులో ఉంచకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

నిర్వాసితులకు పరిహారం మంజూరు చేస్తాం

జీడిపల్లి భూనిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేస్తామని, 34, 36 ప్యాకేజీ పనులు పూర్తిచేస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆమిద్యాల బ్రాంచ్ కెనాల్ పూర్తి చేసి, కొట్టాలపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేస్తామన్నారు. మెగా డ్రిప్ ఇరిగేషన్ కింద 40వేల ఎకరాలకు జీడిపల్లి ద్వారా నీరు అందించి పథకాన్ని పునఃప్రారంభిస్తామన్నారు. ఉరవకొండకు టెక్స్‌టైల్ పార్కు, రామసాగరం వంతెన మంజూరు చేస్తామన్నారు. జీడిపల్లి, బీటీపీ పనులకు కూడా ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేస్తామన్నారు. ఛాయాపురంలో కూడా సీసీరోడ్లు, డ్రైనేజీలు, ఇళ్ల నిర్మాణాలు, వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ్‌శర్మ, ఎస్పీ జగదీష్, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన అడ్డుకునేందుకు యత్నం

వజ్రకరూరు మండలం ఛాయాపురంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను ఏబీవీపీ నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. జీఓ 77ను రద్దు చేయకుండా జిల్లాలోకి అడుగుపెట్టనీయబోమని ఏబీవీపీ నాయకులు ప్రకటించిన విషయం విదితమే. ఈ క్రమంలో వజ్రకరూరు సమీపంలో సీఎం డౌన్ డౌన్, జీఓ 77ను రద్దు చేయాలంటూ నినాదాలు చేస్తు సీఎం సభ వద్దకు చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని చిన్నహోతురు వద్ద అరెస్టు చేసి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఉంచారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అఖిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ లోకేష్ 'యువగళం' పాదయాత్రలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ 77ను రద్దు చేసి ప్రతి విద్యార్థికీ స్కాలర్‌షిప్ అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జీఓ రద్దు చేయకుండా మోసం చేశారన్నారు. ప్రతి విద్యార్థికీ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ఇవ్వని పక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సుధీర్, నిఖిల్, తేజ, భూతరాజు తదితరులు పాల్గొన్నారు.

- ఈనెల 8న తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో ఆశాబీ అనే మహిళ హంగామా చేసింది. బేకరీ, హోటల్, చికెన్ పకోడా దుకాణాల దారుల నుంచి రూ.1,500 చొప్పున వసూలు చేసింది. ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చి ఫుడ్ సేఫ్టీ కార్యాలయానికి ఫోన్ చేయగా...ఆశాబీ పేరుతో ఎవరూ లేరని చెప్పారు. అప్పటికే ఆమె అక్కడి నుంచి ఉడాయించింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- రెండు నెలల క్రితం పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద పేరుతో ప్రైవేటు క్లినిక్ నిర్వహిస్తోన్న డాక్టర్‌కు ఫోన్ కాల్ వచ్చింది. పన్ను బకాయిలు చాలా ఉందని, ఈ రోజు లోపు ఎంతోకొంత అందజేస్తే.. మాఫీ అయ్యే అవకాశం ఉందని నమ్మబలికి ఫోన్ పే నంబరు కూడా చెప్పారు. అయితే డాక్టర్ తెలివిగా వ్యవహరించి.. మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. తర్వాత ఆ ఫోన్ నంబరు స్విచాఫ్ వచ్చింది.
- ఆరు నెలల క్రితం నల్లమాడ మెయిన్ రోడ్డులోని ఓ బేకరీలోకి వెళ్లిన అగంతకుడు.. తాను ఫుడ్ సేఫ్టీ అధికారినంటూ హడావుడి చేశాడు. బేకరీపై ఫిర్యాదులు వస్తున్నాయంటూ దబాయించాడు. రూ.10 వేలు ఇస్తే తనిఖీలు చేయకుండా వెళ్తామని చెప్పాడు. వ్యాపారి బతిమాలడంతో రూ.5 వేలు తీసుకుని ఉడాయించాడు. ఆ తర్వాత అతడు నకిలీ అధికారి అని తేలడంతో బేకరీ నిర్వాహకులు లబోదిబోమన్నారు.

రూటు మార్చిన కేటుగాళ్లు

- అధికారుల పేరుతో డబ్బు వసూలు
- జిల్లాలో నకిలీ అధికారుల హల్‌చల్
- పన్నుల పేరిట ఆన్‌లైన్‌లో దందా
- ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరుతో చిల్లర రాబడుతున్న వైనం



సాక్షి, పుట్టపర్తి

ప్రభుత్వ అధికారుల పేరుతో కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. మొబైల్ కాల్స్ ద్వారా నిమిషాల్లో డబ్బులు కొల్లగొడుతున్నారు. తాము మోసపోయామని బాధితులు తెలుసుకునేలోపే అక్కడి నుంచి పరారవుతున్నారు. అనంతరం మొబైల్స్ స్విచాఫ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల కాలంలో జిల్లాలో వరుసగా వెలుగు చూస్తున్నాయి.

పెరిగిన సైబర్ నేరాలు

జిల్లాలోని హిందూపురం, పుట్టపర్తి, కొత్తచెరువు, ధర్మవరం, కదిరి తదితర ప్రాంతాల్లో సైబర్ మోసాలు పెరిగిపోయాయి. అమాయక ప్రజలను టార్గెట్ చేసి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. పల్లె ప్రాంతాల నుంచి పట్టణాల వరకు సైబర్ మోసాలు వెలుగు చూస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు సమూహంగా ఏర్పడి.. కొత్త కొత్త మొబైల్ నంబర్ల నుంచి కాల్ చేసి మాయమాటలు చెప్పి.. నిమిషాల వ్యవధిలో డబ్బులు లాగుతున్నారు. లాటరీ తగిలిందని.. పర్సనల్ లోన్ అప్రూవల్ అయిందని.. ట్యాక్స్ ఆన్‌లైన్‌లో కడితే రాయితీ వస్తుందని.. ఇలా పలు రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు.

నకిలీ కార్డులతో గుంపుగా వచ్చి..

రెండు నెలల క్రితం నల్లమాడ, బుక్కపట్నం, ఓడీ చెరువు, కొత్తచెరువు, గోరంట్ల, తనకల్లు తదితర ప్రాంతాల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల పేరుతో దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లలో దుండగులు చొరబడ్డారు. తమ వాహనాలను ప్రభుత్వ స్టిక్కర్లు వేసుకుని.. నకిలీ కార్డులు మెడలో వేసుకుని ఆయా దుకాణదారులను భయపెట్టి భారీగా వసూళ్లు చేశారు. ఓ దుకాణదారుడికి వీరి వ్యవహారంపై అనుమానం రావడంతో అతను ఫుడ్ సేఫ్టీలో తమకు తెలిసిన వాళ్లు ఉన్నారని చెప్పాడు. దీంతో ఆగంతకులు తమ బండారం ఎక్కడ బయట పడుతుందోనని భయపడి అక్కడి నుంచి పరారయ్యారు. ఆ తర్వాత వారందరూ నకిలీ అధికారులని తెలిసింది. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు.

అధికారులపైనే ఆరోపణలు

కొందరు ప్రభుత్వ అధికారులు తమ పరిధిలో అక్కడక్కడా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని నకిలీ ఐడీ కార్డులు అందజేసి వసూళ్లు చేయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై కొందరిని ప్రశ్నించగా.. తమకు సంబంధం లేదని దాటవేశారు. నకిలీ అధికారుల ఆచూకీ తెలిపితే.. తాము పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ, తూనికలు, కొలతలు, ఆదాయ పన్ను, కరెంట్ బిల్లు వసూలు, బ్యాంకుల్లో పర్సనల్ లోన్, క్రెడిట్ కార్డుల్లో ఆఫర్లు తదితర పేర్లతోనే ఎక్కువగా సైబర్ మోసాలు జరుగుతున్నాయి.

అప్రమత్తత అవసరం



సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మొబైల్ ద్వారా వచ్చే ఓటీపీలను తెలియని వ్యక్తులు అడిగితే షేర్ చేయరాదు. పన్ను వసూళ్ల పేరుతో వచ్చే ఫోన్ కాల్స్‌కు స్పందించాల్సిన అవసరం లేదు. అధికారులపై ఎలాంటి అనుమానం వచ్చినా.. వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. ప్రజల సహకారంతోనే సైబర్ నేరాల కట్టడి సాధ్యం. – వి.రత్న, జిల్లా ఎస్పీ

క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు

- ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు



చిలమత్తూరు: ప్రజా స్వామ్యంలో పత్రికలది కీలక భూమికని, ఎన్నో కష్టాలకోర్చి ప్రజా సమస్యలపై పోరాడే పాత్రికేయరంగంపై కక్ష సాధింపు చర్యలు ఒక విధంగా ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా భావించాల్సి వస్తుందని ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాసులు అన్నారు. పాత్రికేయులు, ఎడిటర్లపై దాడులు, కేసులు అప్రజాస్వామికమన్నారు. ఇది దేశ భవిష్యత్‌కు ప్రమాదకరమన్నారు. ఎలాంటి వారెంట్ లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి ఇంట్లో తనిఖీలు చేపట్టిన పోలీసుల తీరును ఆయన ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాల్సిన తరుణంలో ఇలాంటి చర్యలకు దిగడం సిగ్గుచేటన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు

- వాహనాల స్పెషల్ డ్రైవ్‌లో ఎస్పీ రత్న



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రత్న హెచ్చరించారు. గురువారం రాత్రి 10గంటల సమయంలో ఎస్పీ స్వయంగా ధర్మవరం – కోడూరు ప్రధాన రహదారిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు పేర్కొన్నారు. గంజాయి. ఇతర మాదక ద్రవ్యాలు అక్రమ రవాణ, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, పెండింగ్ చలానాలు, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఎంతటి వారినైనా ఉపేక్షించబోమన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయకుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ సురేష్, ఎస్ఐ లింగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మృత్యు తీగలు

- ప్రమాదకరంగా కరెంటు వైర్లు
- తరచూ ఏదో ఒక చోట విద్యుత్ ప్రమాదం
- ప్రాణాలు కోల్పోతున్న చిన్నారులు, రైతులు
- విద్యుదాఘాతంతో మూగ జీవాలూ బలి
- చేతికందే ఎత్తులో వైర్లున్నా.. పట్టించుకోని అధికారులు
- పలు మార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతుల ఆవేదన



- ఈనెల 2వ తేదీన హిందూపురం పట్టణం ముదిరెడ్డిపల్లిలో ఆరేళ్ల బాలుడు అశ్విన్ ఆరాధ్య విద్యుదాఘాతానికి గురై మరణించాడు. క్రికెట్ బాల్ కోసం పాఠశాల భవనంపైకి ఎక్కగా సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. ఈ ఘటనకు అధికారుల నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తోంది.
- ఈనెల 3వ తేదీన ధర్మవరం పట్టణం రామ్‌నగర్‌లో డ్రైనేజీ కాలువలో ఉన్న విద్యుత్ స్తంభానికి విద్యుత్ ప్రసరించింది. అటుగా వెళ్లి రెండు వరాహాలు స్తంభానికి తగులుకుని విద్యుదాఘాతానికి గురై మరణించాయి. అదృష్టవశాత్తూ మనుషులు వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభానికి పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు కనిపిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- ఈనెల 4వ తేదీన గాండ్లపెంట మండలం పోరెడ్డివారిపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమరుస్తుండగా.. పైన ఉన్న వైర్లు లైన్‌మన్‌కు తగిలాయి. అతడి వీపు మొత్తం కాలిపోయింది. పక్కనే ఉన్న రైతు కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే అప్రమత్తం కావడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఇద్దరినీ కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు.

సాక్షి, పుట్టపర్తి

విద్యుత్ తీగలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి. తక్కువ ఎత్తులో వేలాడుతూ.. ఎందరినో బలి తీసుకుంటున్నాయి. మనుషులతో పాటు అక్కడక్కడా మూగజీవాలు సైతం విద్యుత్ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నాయి. ఏడాది కాలంలో జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, హిందూపురం సబ్ డివిజన్లలో మొత్తంగా 56 విద్యుత్ ప్రమాదాలు జరిగాయి. అందులో పగటి పూట 45, రాత్రి వేళల్లో 11 ప్రమాదాలు జరిగాయి. ఆయా ఘటనల్లో 41 మంది మరణించగా.. మరో 15 మంది గాయాలతో బయటపడ్డారు. నిత్యం ఎక్కడోచోట విద్యుత్ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

2024 మార్చి నుంచి విద్యుత్ ప్రమాదాలు ఇలా...

డివిజన్	పగటి పూట	రాత్రి వేళ	ప్రాణాంతకం	ప్రమాదం
పుట్టపర్తి	11	4	12	3
హిందూపురం	17	4	18	3
కదిరి	17	3	11	9
మొత్తం	45	11	41	15

అధికారిక లెక్కలు తక్కువగా ఉన్నప్పటికీ.. లెక్కలో లేనివి లెక్కలేనన్ని ఉన్నాయి. విద్యుత్ వైర్లు తక్కువ ఎత్తులో ఉండటం, కరెంటు స్తంభాలు పెచ్చులూడి కడ్డీల ద్వారా విద్యుత్ ప్రసారం కావడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గాలీవాన సమయంలో ఏళ్లుగా నిర్వహణ లోపానికి గురైన స్తంభాలు ఉన్నఫలంగా నేలకొరుగుతున్నాయి. ఈ సమయంలో అటుగా ఎవరు వెళ్లినా విద్యుదాఘాతానికి గురవుతున్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష..



విద్యుత్ ప్రమాదాల్లో అప్రమత్తత చాలా అవసరం. ఎలాంటి అనుమానం వచ్చినా.. కరెంటు తీగలను తాకకుండా ఉంటే మంచిది. వర్షం వచ్చిన సమయంలో కరెంటు స్తంభాలు, వైర్లు ఉన్న ప్రాంతాల్లో ప్రజలు ఆచితూచి వ్యవహరించాలి. పొలాల్లో చేతికందే ఎత్తులో ఉన్న వైర్ల గురించి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు చేపడతాం.

– సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

మర్చిపోలేని తాడిమర్రి ఘటన..

తాడిమర్రి మండలంలో 2022 జూన్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదం తలుచుకుంటే ఇప్పటికీ భయమేస్తుంది. కూలీలతో వెళ్తున్న ఆటోపై విద్యుత్ వైర్లు తెగి పడటంతో ఆరుగురు అక్కడికక్కడే కాలి బూడిదయ్యారు. ఆ సమయంలో విద్యుత్ శాఖ హడావుడి చేసినా ఫలితం మాత్రం లేకుండా పోయింది. దీంతో జిల్లాలో ఏదో చోట విద్యుత్ ప్రమాదం జరుగుతూనే ఉంది.

నిర్లక్ష్యమే పెనుభూతమై..

విద్యుత్ ప్రమాదాల్లో చాలావరకు నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. అధికారుల అలసత్వం . ప్రజల అవగాహన లోపం.. వెరసి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. విద్యుత్ ప్రమాదం ఎలా సంభవించినా ప్రాణాంతకమే. చాలా ప్రాంతాల్లో చేతికందే ఎత్తులోనే విద్యుత్ వైర్లు వేలాడుతుంటాయి. అలాంటి వాటిని అధికారులు పైకి లాగితే సరిపోతుంది. కానీ విద్యుత్ శాఖ అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రజలే పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో మూగ జీవాలు కరెంటు తీగలకు తగిలి ప్రాణాలు కోల్పోతున్నాయి. అలాగే పలు ప్రాంతాల్లోని ఇళ్లకు సైతం విద్యుత్ ప్రసరించి పెను ప్రమాదానికి దారి తీస్తోంది.

యంత్రం తగిలి వృద్ధుడి మృతి



మృతుడు వేమన్న

గాండ్లపెంట: మండలంలోని జీనులకుంట గ్రామంలో అజాక్స్ యంత్రం తగిలి వి.వేమన్న గౌడ్ (75) మృతిచెందాడు. ఆయనకు భార్య చిట్టెమ్మ, ఓ కుమారుడు ఉన్నారు. వివరాలు.. జీనులకుంటలోని ప్రాథమిక పాఠశాల వద్ద సీసీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అజాక్స్ యంత్రంలో కంకర, సిమెంట్ వేసి కలుపుతుండగా వెనుక వైపున ఉన్న వేమన్న ఎడమకాలుకు తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే వెంటనే కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స అందేలోపు మృతి చెందాడు. మృతుని కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చేపల వేటకు వెళ్లి..



మృతుడు హైదర్‌వలి

లింగాల: కదిరి మండలం చెలంకూరుపల్లికి చెందిన బెల్లం హైదర్‌వలి (58) వైఎస్సార్ జిల్లా లింగాల మండలం కామసముద్రం గ్రామంలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు తెలిపారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న ఆయన శుక్రవారం కామసముద్రం గ్రామ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో చెరువు గట్టు మీద నుంచి ప్రమాదవశాత్తు నీటిలోకి పడిన హైదర్‌వలికి ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారులు ఉన్నారు. కుమారుడు బాబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు.

బైక్‌పై నుంచి జారి పడి..



మృతురాలు సిద్ధగంగమ్మ

అగళి: ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడిన ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... అగళి మండలం మధూడి గ్రామానికి చెందిన సిద్ధగంగమ్మ (48)కు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్నేళ్ల క్రితం భర్త తిప్పేస్వామితో పాటు కుమారుడు మంజునాథ్ మృతి చెందారు. కుమార్తె కాంచనకు పెళ్లి చేయడంతో ఆమె బెంగళూరులో స్థిరపడి ఓ గార్మెంట్స్ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తోంది. గ్రామంలోనే సిద్ధగంగమ్మ వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం నరసంబూధి గ్రామంలో తోటలో పూలు విడిపించేందుకు వెళ్లిన ఆమె పని ముగించుకున్న అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైంది. మార్గమధ్యంలో పిల్లి అడ్డుగా రావడంతో వాహనం అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆమెను కర్ణాటకలోని శిరలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై అగళి పోలీసులు కేసు నమోదు చేశారు.

విజిలెన్స్ అధికారినంటూ యువతికి వల

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి 40 గ్రాముల బంగారం అపహరణ

చిలమత్తూరు: విజిలెన్స్ అధికారిగా పరిచయం చేసుకున్న వ్యక్తి పెళ్లి పేరుతో ఓ యువతిని వంచనకు గురిచేశాడు. ఆమె వద్ద ఉన్న బంగారు నగలు అపహరించాడు. వివరాలు.. చిలమత్తూరు మండలం చిన్నపరెడ్డిపల్లికి చెందిన యువకుడు వడ్డె నరేష్ మ్యాట్రిమోనీ సైట్‌లో ఓ ప్రొఫైల్ తెరిచి తాను విజిలెన్స్ అధికారినంటూ నమోదు చేశాడు. అదే మ్యాట్రిమోనీ సైట్‌లో బెంగళూరులోని తన అక్క ఇంట్లో ఉంటూ ఓ కంపెనీలో బీపీఓగా పనిచేస్తున్న నెల్లూరుకు చెందిన ఓ యువతి కూడా తన వివరాలు పొందుపరిచింది. వివరాలు పరిశీలించిన వడ్డె నరేష్ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ప్రభుత్వం ఉద్యోగి అని నమ్మిన యువతి విషయాన్ని తన సోదరికి వివరించి పెళ్లికి అంగీకారం తెలిపింది. కొన్ని రోజుల తర్వాత ఆమెకు మంచి ఉద్యోగం చూశానని ఇందుకు రూ.2 లక్షలు డబ్బు డిపాజిట్ చేయాల్సి ఉందని తెలిపాడు. అయితే తన వద్ద అంత డబ్బు లేకపోవడంతో పెళ్లి కోసం సిద్ధంగా ఉంచుకున్న 40 గ్రాముల బంగారాన్ని అప్పగించింది. ఆ నగలను కర్ణాటకలోని బాగేపల్లిలో ఉన్న ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో నరేష్ తాకట్టు పెట్టి రూ.2 లక్షలు రుణం తీసుకుని, పత్తా లేకుండా పోయాడు. ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో చివరకు సదరు యువతి చిన్నపరెడ్డిపల్లికి చేరుకుని నిలదీసింది. పెళ్లికి నిరాకరించడంతో శుక్రవారం చిలమత్తూరు పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు నరేష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో మొత్తం నలుగురు సభ్యులు ముఠాగా ఏర్పడి మోసాలకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారణ అయింది. యువతి బంగారాన్ని రికవరీ చేయించి అప్పగించారు. కాగా, ఇదే తరహాలో అనంతపురానికి చెందిన ఓ యువతికి గతంలో టోకరా వేసినట్లుగా చర్చ సాగుతోంది. కాగా, ఘటనపై పోలీసుల ఎలాంటి కేసు నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

స్కీమ్‌లో స్కాం లేకపోతే ఉలుకెందుకు?



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్

- సవాల్‌ను స్వీకరిస్తున్నాం దమ్ముంటే బహిరంగ చర్చకు రండి
- వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి సవితకు లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్

పెనుకొండ రూరల్: కుట్టు శిక్షణ స్కీమ్‌లో స్కామ్ లేకపోతే ఉలుకెందుకని మంత్రి సవితను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు కేవీ ఉష శ్రీచరణ్ ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శించే స్థాయి సవితకు లేదన్నారు. శుక్రవారం ఉదయం నాగలూరులో కాఫీ విత్ వైఎస్సార్ సీపీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కుట్టు శిక్షణ మొత్తం ప్రక్రియ ఓ పెద్ద స్కామ్ అన్నారు. ఇందులో స్కాం జరగకపోతే మహిళలకు కుట్టు మిషన్ కిట్టు ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. రోజూ ఎనిమిది గంటల శిక్షణ అంటూ నాలుగు గంటలకే ఎందుకు కుదించారన్నారు. శిక్షణా కేంద్రంలో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదన్నారు. మంత్రి సవిత సవాల్‌ను తాము స్వీకరిస్తున్నామని, దమ్ముంటే బీసీ సంక్షేమ శాఖ మాజీ మంత్రి మాలగుండ్ల శంకరన్న సమక్షంలోనే బహిరంగ చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. వేదిక, టైం నిర్ధారణ మంత్రి సవితనే చెప్పాలన్నారు. బీసీ సాధికారిత ప్రభుత్వంగా చెప్పుకునే మంత్రి ఎన్నికల వాగ్దానాలలో భాగంగా బీసీలకు ఇచ్చిన 50 ఏళ్లకే పింఛన్ ఏమైందో చెప్పాలన్నారు. ఇప్పటి వరకూ తల్లికి వందనం ఊసే లేదన్నారు. అర్హత కలిగిన ప్రతి బీసీ మహిళకు రూ.18వేల అందించి, జీవనోపాధులు మెరుగు పరిచిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే సొంతమన్నారు. అక్రమంగా మైనింగ్, క్రషర్లు నడుపుతూ వ్యాపారులను పెనుకొండలోకి రాకుండా అడ్డుకున్న నీచ చరిత్ర మంత్రి సవితదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పట్టణ, మండల కన్వీనర్లు సుధాకర్ రెడ్డి, నరసింహులు, మాజీ కన్వీనర్లు బాబు, శ్రీకాంతరెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, వైశాలి జయశంకరరెడ్డి, కొండలరాయుడు, గోపాలరెడ్డి, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

బస్సు బోల్తా -15 మందికి గాయాలు



గోరంట్ల: మండలంలోని మిషన్‌తండా సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి కియా అనుబంధ పరిశ్రమ హూయంగ్‌కు చెందిన బస్సు బోల్తాపడింది. ఘటనలో 15 మంది కార్మికులు గాయపడ్డారు. కార్మికులందరూ ఓడీసీ మండలానికి చెందిన వారిగా తెలుస్తోంది. క్షతగాత్రులను 108 వాహనంలో హిందూపురంలోని ఆస్పత్రికి తరలించారు.

విమానాశ్రయంలో సీఎంకు స్వాగతం



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రులు భరత్, సవిత

పుట్టపర్తి టౌన్: స్థానిక సత్యసాయి విమానాశ్రయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఘన స్వాగతం లభించింది. అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా సీఎం శుక్రవారం విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12 గంటలకు పుట్టపర్తికి చేరుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, సవిత, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, ఎమ్ఎస్‌రాజు, కందికుంట ప్రసాద్, సత్యసాయి ట్రస్టు ప్రతినిధి చలం, కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఎస్పీ రత్న, ఆర్డీఓ సువర్ణ స్వాగతం పలికారు. అనంతరం సీఎం ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో ఉరవకొండకు బయలుదేరి వెళ్లారు.

దళిత రైతుల పురోగతికి సాంకేతిక పరిజ్ఞానం



ప్రాజెక్ట్ నిర్వహిస్తున్న ప్రొఫెసర్లను అభినందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు

అనంతపురం: జిల్లాలోని దళిత రైతుల పురోగతికి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రాజెక్ట్ నిర్వహణను జేఎన్‌టీయూ(ఏ) దక్కించుకుంది. డిపార్ట్‌మెంటల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, న్యూఢిల్లీకి చెందిన సీడ్ (సైన్స్ ఫర్ ఈక్విటీ, ఎంపవర్‌మెంట్ అండ్ డెవలప్‌మెంట్) విభాగం ద్వారా అమలవుతున్న ఎస్సీ (షెడ్యూల్ కాస్ట్) హబ్ కింద రూ.47,62,047 నిధులు మంజూరయ్యాయి. ఈ ప్రాజెక్ట్‌ను జేఎన్‌టీయూ (ఏ) క్యాంపస్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ఎలక్ట్రానిక్స్ ప్రొఫెసర్ ఎస్. చంద్రమోహన్‌రెడ్డి, కెమికల్ విభాగం ప్రొఫెసర్ బి.దిలీప్‌కుమార్, ఎలక్ట్రికల్ విభాగం డాక్టర్ జి. మమత నిర్వహించనున్నారు. మూడేళ్ల గడువున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా వేరుశనగ ద్వారా నూనె, స్నాక్స్, టమాట ద్వారా సాస్, డ్రై టమాట వంటి విలువ జోడింపు ఉత్పత్తుల తయారీకి శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే రైతులకు మార్కెట్ లింకేజీలు, నిల్వ సౌకర్యాలు, ఉత్పత్తుల బ్రాండింగ్ వంటి అంశాలపై మద్దతునివ్వనున్నారు. ప్రత్యేకంగా దళిత రైతులకు నైపుణ్య శిక్షణా శిబిరాలు, వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు, మార్కెట్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఈ సందర్భంగా పరిశోధక బృందాన్ని శుక్రవారం జేఎన్‌టీయూ వీసీ హెచ్.సుదర్శనరావు అభినందించారు.

ఇంధన సహాయకుల జీవితాలతో ఆడుకోవద్దు

- సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు



సమావేశంలో మాట్లాడుతున్న పుల్లగమ్మి రాజు

ధర్మవరం రూరల్: రాష్ట్రంలో సచివాలయ ఉద్యోగులతో పాటు నియమితులైన ఇంధన సహాయకుల జీవితాలు కూటమి ప్రభుత్వ తీరుతో ఆగమ్యగోచరంగా మారాయని ఆంధ్రప్రదేశ్ వార్డు, గ్రామ సచివాలయాల ఎనర్జీ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లగమ్మి రాజు మండిపడ్డారు. శుక్రవారం ఆ సంఘం జిల్లా నాయకులతో కలిసి స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయాల్లోని అన్ని శాఖలకు సంబంధించి మార్పులు చేస్తున్నారన్నారు. ఉద్యోగులకు నిర్దిష్టమైన చానల్ కల్పిస్తూ ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయితే ఎనర్జీ అసిస్టెంట్ల విషయంలో ఇప్పటి వరకూ ఎలాంటి మార్పులు చేయలేదన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ జీవితాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. విధి నిర్వహణలో భాగంగా గడిచిన 5 ఏళ్లలో 140 మంది ఇంధన సహాయకులు మృత్యువాత పడ్డారన్నారు. 250 మంది తీవ్రంగా గాయపడిన సంఘటనలూ ఉన్నాయన్నారు. ఇంధన సహాయకుల కుటుంబాలు రోడ్డున పడుతున్నా విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల్లో చలనం లేకపోవడం బాధాకరమన్నారు. ఇంధన సహాయకులకు న్యాయం చేకూరకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లికార్జునరెడ్డి, సుధీర్, పవన్, రాజేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కూటమి ప్రభుత్వానికి ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు సూచించారు. జిల్లాకు విచ్చేసిన ఆయన శుక్రవారం స్థానిక రెవెన్యూ సంఘం కార్యాలయంలో సంఘం సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ వేయకపోవడం, డీఏ ప్రకటించకపోవడం, డీఏ, పీఆర్సీ ఆరియర్లపై స్పష్టత లేకపోవడం, మధ్యంతర భృతి ఊసేత్తకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరిస్తే ఫలితం మరో విధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాజేష, జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్‌ఖాన్, మహిళ విభాగం జిల్లా చైర్మన్ సురేఖరావు, ప్రధాన కార్యదర్శి కృష్ణజ్యోతి, జిల్లా నాయకులు, శ్రీసత్య సాయి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా నరసింహమూర్తి



నరసింహమూర్తి

హిందూపురం టౌన్: ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా హిందూపురానికి చెందిన నరసింహమూర్తి ఎన్నికయ్యారు. శుక్రవారం పుట్టపర్తిలో జరిగిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు సాగిస్తామని అన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహేంద్ర

కదిరి అర్బన్: ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహేంద్ర ఎన్నికయ్యారు.తన నియామకానికి సహకరించిన ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య తీర్చాలంటూ మహిళల ధర్నా



రాళ్లపల్లి సచివాలయం ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

గుడిబండ: మండల పరిధిలోని రాళ్లపల్లి హరిజన కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య తీర్చాలంటూ గ్రామ సచివాలయం ఎదుట శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా చేపట్టారు. లో ఓల్టేజ్ సమస్య కారణంగా రోజూ తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.సమస్య పరిష్కారానికి అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.

డీఎస్సీకి ఆన్‌లైన్ శిక్షణ

లేపాక్షి: త్వరలో జరిగే డీఎస్సీకి సంబంధించి అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారిత అధికారి నిర్మలాజ్యోతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరికి చెందిన జిల్లా వాసులు మాత్రమే అర్హులు. టెట్ మార్కుల పత్రం , నెటివిటీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, రెండు ఫొటోలు జతపరిచిన దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ లోపు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో అందజేయాలి. పూర్తి వివరాలకు 93921 41545లో సంప్రదించవచ్చు.